క్లుప్తంగా

వేణుగోపాలునికి నేడు చందనోత్సవం

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి 7 గంటలకు చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి, అమ్మవారికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 13న స్వామి వారికి శ్రీపుష్పయాగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలపై చర్చిస్తున్న కరప డీసీ చైర్మన్, ఇరిగేషన్ అధికారులు

కరప: సాగునీటి సంఘాల పరిధిలో సమస్యలను ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్టు కరప డీసీ చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశమందిరంలో శుక్రవారం ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లతో సమావేశమై పంట, మురుగు కాలువల పరిస్థితిని, నెలకొన్న సమస్యలపై చర్చించారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు వదులుతారని, ఆ లోగా పనులు పూర్తి చేయాలని చైర్మన్ తెలిపారు. ఇరిగేషన్‌శాఖ కొవ్వూరుసెక్షన్ డీఈఈ ఆనందకుమార్, ఏఈఈ నాగిరెడ్డి నాగభవాని తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరికీ తూనికలు, కొలతపై అవగాహన అవసరమని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ సుధాకర్ అన్నారు. వీటి నివారణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ప్రపంచ తూనికలు, కొలతలు దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు వ్యాపార సంస్థల ప్రతినిధులతో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తూనికలు, కొలతల్లో మోసాలు, వాటి నివారణకు ప్రభుత్వం తీసుకునే చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వినియోగదారుల కోసం వ్యాపారస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వివిధ రకాల ప్యాకింగ్ వస్తువులు విక్రయాలపై అవగాహన కల్పించారు.

సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్

కాకినాడ రూరల్: భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళిక సంఘ సభ్యురాలిగా సేవలు అందించిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రముఖ సంఘసంస్కర్త అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె బాల్యం నుంచి ప్రతిభాపాటవాలను కనపరిచేవారన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించిన ఆమె 1981 మే 9న నరసన్నపేటలో కాలం చేశారని నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతీయుల ఆత్మగౌరవం 'సిందూర్'

బోట్‌క్లబ్: పహల్గాంలో ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత్ జవాన్లు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించి భారతీయులు ఆత్మ గౌరవం నిలబెట్టారని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కింతాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం భారత జవాన్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కింతాడ సత్యనారాయణ, స్వయంవరం శ్రీనివాస్ ఆవుపాటి ఉమాశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుపై శ్రద్ధ చూపాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: తరగతుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉండేలా నమోదులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల, వేట్లపాలెం, మాధవపట్నం జెడ్పీ పాఠశాలలోని ఉపాధ్యాయులతో ఆయన సమీక్షించారు. ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరేళ్లు పూర్తయిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని విద్యార్థుల కోసం 70 శాతం పాఠ్యపుస్తకాలు, 100 శాతం నోట్ పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు అనురాధ, గోవిందరాజులు, ప్రసూన, టి.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని కాపాడేదెలా?



టార్పాలిన్లు లేక గోనె సంచులతో తయారు చేసుకున్న బరకాల పైనే ఆరబోసిన ధాన్యం

- బరకాలు లేక అకాల వర్షాలతో ఇబ్బంది
- గతంలో సబ్సిడీపై మంజూరు
- పంపిణీ లేక అన్నదాతల అవస్థలు

కాకినాడ సిటీ: అకాల వర్షాల నుంచి పంట ఉత్పత్తులను రక్షించుకునేందుకు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ధాన్యం కళ్లాల్లో ఆరబెడితే వర్షాలకు తడిసిపోతోంది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటే రైతుల గుండెలు గుభేలుమంటున్నాయి. టార్పాలిన్ పట్టాలు కప్పుకుని కాపాడుకుందామంటే ప్రభుత్వం వాటిని సరఫరా చేయడంలేదు. దీంతో కాకినాడ రూరల్ డివిజనల్‌లోని 9 మండలాల రైతులు పంట ఉత్పత్తులను నష్టపోతున్నారు.

గతంలో 50 శాతం సబ్సిడీపై

ఖరీఫ్, రబీ సీజన్లలో అకాల వర్షాలకు రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం తొమ్మిది మండలాల్లో 4,500కు పైగా రైతులు 1.24 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. నాలుగు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు కళ్లాల్లో, రోడ్ల వెంబడి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. గతంలో వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీపై టార్పాలిన్లు (పట్టాలు) అందించారు. మార్కెట్‌లో టార్పాలిన్ ధర రూ.2500 ఉంటే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.1250కు ఇచ్చేది. దీంతో రైతులు అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకునేవారు. ఇప్పుడు అవి లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేటు వ్యాపారుల వద్ద నాణ్యత లేని బరకాలు

ప్రభుత్వం టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడుతున్నారు. సమీప పట్టణాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో బియ్యం, రొయ్యల మేతలకు ఉపయోగించే సంచులతో కుట్టిన బరకాలు అందుబాటులో ఉండడంతో వాటిని తెచ్చుకుని ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఇవి నాణ్యతమైనవి కాకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం రాశులపై వీటిని కప్పినా వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఇప్పటికీ పాతవి, పాడైన టార్పాలిన్లనే కొందరు రైతులు వినియోగిస్తున్నారు. కొందరు గోనె సంచులను ఉపయోగిస్తున్నా పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. ధాన్యం తడిసి మళ్లీ తేమశాతం పెరిగి కొనుగోలు కేంద్రాల్లో ఇక్కట్లు తప్పడం లేదంటున్నారు.

అకాల వర్షాలకు పంట తడిసిపోతోంది

టార్పాలిన్లు లేకపోవడంతో గోనె సంచులతో కుట్టుకున్న బరకాలు వినియోగించుకుంటున్నాం. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన టార్పాలిన్లు ఎంతో నాణ్యంగా ఉండేవి ఇప్పుడు అవి లేకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టం వాటిల్లితోంది.

– రాయుడు శ్రీనివాస్, యండమూరు, కరప మండలం

అధిక ధరకు కొన్నాను

ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరకు టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నాం. అవి తక్కువ పొడవు, నాణ్యత లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ధాన్యం తడవకుండా ఆపలేకపోతున్నాయి. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సబ్సిడీపై టార్పాలిన్లను ప్రభుత్వం అందించాలి.

– వెలుగుబంటి సీతారామరాఘవ, విజయరాయడుపాలెం, కరప మండలం

అనస్థీషియా హెచ్‌ఓడీగా ప్రసన్నకుమార్



డాక్టర్ ప్రసన్నకుమార్‌కు అభినందనలు తెలుపుతున్న నర్సుల బృందం

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అనస్థీషియా డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా డాక్టర్ గుడాల ప్రసన్నకుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రసన్నకుమార్‌ను వివిధ విభాగాల హెచ్‌వోడీలు సహా డిపార్టుమెంట్‌లోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు.

పంచాయతీల జనాభా, ఆదాయ వివరాలపై సమీక్ష



కరపలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

కరప: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల జనాభా, వారి ఆదాయం తదితర వివరాలతో జాబితా తయారుచేసి, వెంటనే ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు సిబ్బందిని కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై, వివిధ అంశాలపై చర్చించి, అనుసరించాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. గ్రామ పంచాయతీల రీ–గ్రేడింగ్ జరగనుందని, అందుకు కావాలసిన జాబితాలను ఇవ్వాలన్నారు. దాని ఆధారంగా పంచాయతీలను నాలుగు గ్రేడులుగా విభజిస్తారన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణలో తడి, పొడిచెత్త విడి, విడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలని, కంపోస్టు ఎరువు తయారీ, స్వర్ణ పంచాయతీ పోర్టల్, స్వామిత్వ సర్వే తదితర విషయాలపై డిప్యూటీ ఎంపీడీఓ సమీక్షించారు.

గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



బుట్టలో గోవతాళ్ల రూపంలో గంగమ్మతల్లి



తప్పెటగుళ్లు ఆడుతున్న యాదవులు

- గోవతాళ్ల రూపంలో గ్రామదేవత
- రేపటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ

కరప: మండలం పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మ జాతర ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ జాతరనే గొల్లల సంబరంగా పేర్కొంటారు. పూర్వకాలంలో గ్రామంలోని గొల్లపల్లి వంశీయుల పొలంలో గోవతాళ్ల రూపంలో భూమిలో దొరికాయని, అప్పటి నుంచి గ్రామ దేవతగా కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గోవతాళ్లను బుట్టలో ఉంచి ఆలయంలో దూలానికి వేలాడదీసి ఉంచుతారు. ఈ గోవతాళ్లనే గంగమ్మతల్లిగా కొలుస్తుంటారు. ఈ జాతరకు 150 గ్రామాల నుంచి గొల్లల కుటుంబాల వారు వచ్చి ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు కళాత్మకంగా తప్పెటగుళ్లు ఆడతారు. ఆ కుటుంబాలకు గ్రామస్తులు అతిథి మర్యాదులు చేస్తారు. జాతరకు నెలరోజుల ముందుగా మేలుకొలుపు పేరుతో ఆహ్వాన పత్రికలు, అమ్మవారి శేష అక్షింతలు పంపించి ఆహ్వానం పలుకుతారు. ఆదివారం గంగమ్మ తల్లి ఆలయంలో దూలానికి వేలాడదీసిన గోవతాళ్లను కిందకు దించి, ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. సోమ, మంగళవారాల్లో గ్రామంలో అమ్మవారిని ఊరేగించి, గ్రామపొలిమేరలో మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలో పాడిపంటలు వృద్ధిచెంది, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని గ్రామస్తులు కోరుకుంటారు. మూడోరోజు మంగళవారం సాయంత్రం గోవతాళ్లను బుట్టలో భద్రపరచి, గుడిలో వేలాడదీయడంతో జాతర ముగిస్తుంది. జాతరకు వచ్చే భక్తులు గొల్లలకు మూడు రోజుల పాటు అన్నదానం చేస్తారు. జాతరలో నృత్యాలతో, తప్పెటగుళ్ల సందడితో అలరించిన గొల్లలకు గొల్లపల్లి వంశీయులు చివరిరోజున బహుమతులు అందజేస్తారు.

సింహవాహనంపై భావనారాయణుడు



సర్పవరంలో సింహ వాహనంపై కల్యాణ దంపతులు రాజ్యలక్ష్మి అమ్మవారు, భావనారాయణ స్వామివారు



భావనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కల్యాణం దంపతులు రాజ్యలక్ష్మి అమ్మవారు, భావనారాయణ స్వామి వారిని శుక్రవారం సాయంత్రం గ్రామంలో తిరువీధుల్లో సింహవాహనంపై ఊరేగించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం కోలాటం, బ్యాండ్ మేళాల నడుమ ఊరేగింపుతో గ్రామంలో సందడి నెలకొంది. 12న సముద్ర తీరాన స్వామి వారి స్నానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

భావనారాయణునికి పూజలు

దేశం, అలాగే సైనికులు నడిపించే ప్రధాని నరేంద్ర మోడీ సుభిక్షంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పిలుపు మేరకు సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పితాని లీలావతి ఆధ్వర్యంలో పూజలు చేశారు. పార్టీ పార్లమెంటు కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు తదితర పార్టీ నాయకులు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా దీటైన ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రస్థావరాలను మట్టిలో కలిపి బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని కలిగిస్తున్నారన్నారు. ఆ భగవంతుడు దీవెనలు దేశంపైన, సైనికుల పైన, మోడీ పైన ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పాలిక శివ, పెంకె అరుణ్ ప్రకాష్, కోమర్తి మురళి, లవరాజు, మేడిశెట్టి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్

సామర్లకోట: రైల్వే ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రైల్వే పోలీసులు గుర్తించి శుక్రవారం బాధితుడికి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నానికి చెందిన అరవింద్ స్థానిక రైల్వే స్టేషన్ వెయిటింగ్ హాల్‌లో సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టాడు. అయితే దుండగులు సెల్‌ఫోన్ అపహరించడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సీసీ కెమెరాలో సెల్‌ఫోన్ చోరీ చేసిన దొంగను గుర్తించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ రికవరీ చేసి ఎస్సై వాసు ఆదేశాల మేరకు బాధితుడికి కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సెల్ ఫోన్‌ను అందజేశాడు.

ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి అభినందన



ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లోని ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పి.నల్లబాబు, డి.శివశంకర్‌లను కమాండెంట్ ఎం.నాగేంద్రరావు అభినందించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా సీఎస్ఎస్ఆర్ కాంపిటేషన్‌లో ఆంధ్రప్రదేశ్ ఎస్‌డీఆర్ఎఫ్ మూడో స్థానంలో నిలిచింది. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందంలో ఏపీఎస్పీ నుంచి పాల్గొన్న వారిని కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది ప్రశంసించారు.

ఐకమత్యమే సంఘానికి బలం

- కల్యాణ మండపానికి శంకుస్థాపనపై పద్మశాలీ సంఘం నాయకుల హితవు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా పద్మశాలీ సంఘ నాయకులు

కాకినాడ సిటీ: కులాల మధ్య రాజకీయాలు చేయొద్దని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెనుకొండ శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా నాయకులు అందే వీరబాబు, కవతవరపు నాగేశ్వరరావు హితవు పలికారు. కాకినాడ జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వెంకటనగర్‌లో తమ సంఘానికి వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించారని, దీనిలో కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఉమ్మడి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారన్నారు. ఇటీవల నూతన సంఘాన్ని ఏర్పాటు చేశామని, వారి ఆధ్వర్యంలో మరోసారి ఆదివారం శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. అయితే ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణతో పాటు పలువురు నేతలను ఆహ్వాన పత్రికలో వేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా మరోసారి పద్మశాలి కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేసేందుకు కొందరు సిద్ధమవ్వడం దారుణమన్నారు. పద్మశాలీలంతా కలసికట్టుగా ఉన్నపుడే సంఘం అభివృద్ధి చెందుతుందని, విభజించి కార్యక్రమాలు చేయడం సరి కాదని నాయకులు కార్యక్రమాలు చేయడం సరి కాదని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గొడుగుల కొండబాబు, అందే రామకృష్ణ, పంపన దుర్గాప్రసాద్, పప్పు నాగేశ్వరరావు, గొడుగుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి విధుల బహిష్కరణ

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈ నెల 20 నుంచి పూర్తి స్థాయిలో విధులు బహిష్కరిస్తున్నట్టు యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల ఐదున కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని, అత్యవసర విభాగం దృష్ట్యా ఇన్నాళ్లు విధులు నిర్వహించామని, సమస్యలు పరిష్కరించకపోవడంతో 20వ తేదీ నుంచి పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొంటామని తెలిపారు.

బార్ అధ్యక్షుడిగా ఆరోసారి మేరుగు

పిఠాపురం: పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేరుగు రాజారావు ఆరోసారి ఎన్నికయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది పిట్ల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా గౌతు రాజు రెండో సారి ఎన్నికయ్యారు. శుక్రవారం పిఠాపురం కోర్టుల సముదాయంలో అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. అంతకు ముందు బార్ అసోసియేషన్ పాలక మండలిలో ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ముమ్మిడి శ్రీనివాస్, స్పోర్ట్సు కార్యదర్శిగా ఎంవీవీఎస్ సత్యనారాయణ, లైబ్రరీ కార్యదర్శిగా జీఎస్ భాస్కరాచార్యులు, లేడీ రిప్రజంటేటివ్‌గా ఎం సత్యవాణిశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సీహెచ్ ప్రేమ్‌జీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రావుల రమేష్, జీవీవీ సత్యనారాయణ, మహిళా సభ్యురాలిగా అల్లాడ గీత, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణదొర, రావుల రమణారావు, కొత్త సురేష్ వ్యవహరించారు. నూతన అసోసియేషన్ సభ్యులను పలువురు న్యాయవాదులు అభినందించారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా!



పిఠాపురంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు శోచనీయం
- పిఠాపురంలో జర్నలిస్టుల ఆందోళన

పిఠాపురం: అరచేతిని అడ్డు పెట్టి సూర్యుడిని ఆపాలనుకోవడం ఎంత మూర్ఖత్వమో చట్టాలను అడ్డు పెట్టుకుని అక్షరాన్ని ఆపాలనుకోవడం అంతే మూర్ఖత్వమని జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు చొరబడి గంటల తరబడి వేధింపులకు దిగడం పై పిఠాపురం జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు ప్రకాష్, లోవరాజు, పల్లవరాజు, జోజిబాబు నాగేశ్వరరావు, దొరబాబు, గణేష్, రమేష్ , వరప్రసాద్ తదితరులు మాట్లాడుతు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వాటిని సరి చేసుకోవాల్సింది పోయి పత్రికల పైనా వాటి సంపాదకుల పైనా ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే అన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడులు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే పత్రికల గొంతు నొక్కేయాలనుకోవడం చాలా దారుణమన్నారు. ఇలాంటి దారుణాలు ఆపకపోతే జర్నలిస్టులంతా రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆందోళనలు చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

పోలీసుల సోదాలు సరికాదు



ఏవైనా కేసులు ఉంటే వాటికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు చేసుకోవాలి. అదికూడా నిర్దిష్ట సమాచారం ఇచ్చి కోర్టు అనుమతితో చేయాలి. ధనుంజయరెడ్డి నివాసంలోకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు చొరబడి గంటల తరబడి వేధింపులకు దిగడం సరి కాదు. ప్రభుత్వాలకు తమ వార్తల ద్వారా ప్రజల బాధలను, ప్రభుత్వ వైఫల్యాలను వివరించే ప్రత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం దురదృష్టకరం.

– ముమ్మిడి లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, పిఠాపురం